సాక్షి ప్రకాశం

శుక్రవారం ◆ 15 ◆ నవంబర్ ◆ 2024



సమస్యల గ్రంథం

జిల్లాలోని గ్రంథాలయాలను సమస్యలు వేధిస్తున్నాయి. సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. నిధులివ్వకుండా వారోత్సవాల నిర్వహణపై విమర్శలు వినిపిస్తున్నాయి.

- 8లో..



రైతుల ఆత్మహత్యలను పట్టించుకోని ప్రభుత్వం

కూటమి ప్రభుత్వం రైతుల ఆత్మహత్యలను పట్టించుకోవడం లేదని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు వడ్డే విమర్శించారు.

- 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 35/26

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సోషల్ మీడియాలో విద్వేషాలు రెచ్చగొడితే చర్యలు

● ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెట్టినా, విద్వేషాలు రెచ్చగొట్టినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఏఆర్ దామోదర్ గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. వాట్సాప్, ఇన్‌స్టాగామ్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్, ఎక్స్ తదితర సోషల్ మీడియాలలో ఇతరులను కించపరిచేలా పోస్టులు పెడితే చర్యలు తప్పవన్నారు. ఇతరుల మనోభావాలు దెబ్బతినేలా, కుల, మత, రాజకీయ వర్గాల మధ్య విద్వేషాలు రగిల్చేలా, వదంతులు, అవాస్తవాలను ప్రచారం చేస్తూ శాంతి భద్రతలకు భంగం వాటిల్లే పోస్టులు పెట్టరాదని సూచించారు. సోషల్ మీడియా గ్రూపుల్లో నిజనిజాలు తెలుసుకోకుండా వివాదాస్పద పోస్టులు పెట్టినా, ఫార్వార్డ్ చేసినా అడ్మిన్లపై చర్యలు తీసుకుంటామన్నారు. సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టేవారిని సైబర్ సెల్‌లోని సోషల్ మీడియా ద్వారా పోలీసులు నిరంతరం గమనిస్తుంటారని తెలిపారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టే ముందు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. అనవసర పోస్టుల ద్వారా భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. ఒకసారి కేసు నమోదైతే ఉద్యోగావకాశాలు, పాస్‌పోర్ట్, వీసాల కోసం ఇబ్బందులు పడాల్సి ఉంటుందని ఎస్పీ తెలిపారు.

పోలీసులకు భారీగా స్థానచలనం

ఒంగోలు టౌన్: జిల్లాలో పోలీసులకు భారీగా స్థానచలనం కల్పిస్తూ ఎస్పీ దామోదర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. 29 మంది హెడ్ కానిస్టేబుళ్లు, ఇద్దరు మహిళా ఏఎస్సైలతో కలిపి మొత్తం 10 మంది ఏఎస్సైలను జిల్లాలోని వివిధ పోలీసుస్టేషన్లకు అటాచ్ చేశారు. ఒకేసారి ఇంత మందిని అటాచ్ చేయడం పోలీసు శాఖలో చర్చనీయాంశంగా మారింది.

జర్మనీలో నర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు వన్‌టౌన్: జర్మనీలో నర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జె.రవితేజ యాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో క్యూరా పర్సనల్ భాగస్వామ్యంతో జర్మనీలో నర్సింగ్ విధులు నిర్వర్తించడానికి జర్మన్ భాషపై శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించే కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. జీఎన్‌ఎం, బీఎస్సీ నర్సింగ్ కోర్సు పూర్తి చేసి కనీసం 2 నుంచి 3 సంవత్సరాల అనుభవం ఉన్న 35 సంవత్సరాల్లోపు వయసు గల వారు అర్హులన్నారు. గుంటూరులో 6 నెలలపాటు శిక్షణ ఉంటుందన్నారు. భాషా కోర్సులు ఏ1, ఏ2, బీ1, బీ2 స్థాయిలలో నేర్పడం జరుగుతుందన్నారు. అభ్యర్థులను ప్రాథమికంగా ఇంగ్లిష్, డిజిటల్ స్కిల్స్, ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. అర్హత పొందిన అభ్యర్థులు రూ.75 వేలు కాషన్ డిపాజిట్ చేయాల్సి ఉంటుందని, అనంతరం తిరిగి చెల్లించడం జరుగుతుందని వెల్లడించారు. శిక్షణ పూర్తయిన అభ్యర్థులకు జర్మనీలో రూ.2,33,000 నుంచి రూ.3,26,000 వరకూ జీతం లభిస్తుందన్నారు. ఇతర వివరాలకు 9988853335 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

అధికారుల సంరక్షణలోకి ముగ్గురు బాలురు



బాలల వివరాలు సేకరిస్తున్న సాగర్

ఒంగోలు సిటీ: స్థానికంగా జాతీయ రహదారి పక్కన గురువారం వర్షంలో తడుస్తూ చిత్తు కాగితాలు, ఖాళీ వాటర్ బాటిళ్లు సేకరిస్తున్న ముగ్గురు బాలురను అధికారులు వారి సంరక్షణలోకి తీసుకున్నారు. అంతర్జాతీయ బాలల దినోత్సవం రోజు మురుగు కాలువలు, ముళ్ల కంపల్లో చిత్తు కాగితాలు, ఖాళీ వాటర్ బాటిళ్లు సేకరిస్తున్న బాలురను గమనించిన హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బీవీ సాగర్.. ఏపీ బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి దృష్టికి తీసుకెళ్లారు. ఆమె సూచన మేరకు ఆ బాలుర వివరాలు సేకరించారు. బత్తుల పద్మావతి తక్షణమే స్పందించి శిశు సంక్షేమ అధికారి, జిల్లా బాలల సంరక్షణ అధికారితో మాట్లాడారు. తక్షణమే ఆ ముగ్గురు బాలురను పాఠశాలలో చేర్పించి వసతి కూడా కల్పించాలని ఆదేశించారు. అంతేగాకుండా వారి కుటుంబ స్థితిగతులు సేకరించాలన్నారు. వారిని పాఠశాలలో చేర్పించినటువంటి పూర్తి నివేదికను రాష్ట్ర బాలల హక్కుల కమిషన్‌కి అందజేయాలన్నారు. బాలలు బడిలోనే ఉండాలని, రోడ్ల పక్కన భిక్షాటన చేయడం, చిత్తు కాగితాలు, ప్లాస్టిక్ డబ్బాలు సేకరించడం వంటివి చేస్తూ కనిపించకూడదని బత్తుల పద్మావతి స్పష్టం చేశారు. బాలలకు బంగారు భవిష్యత్తు అందించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు.

● వాయిదాల పర్వం షురూ..!

ఛ్ఛే..డీఎస్సీ..



- ఆశావాహుల ఆశలపై నీళ్లు
- ఎప్పటిలాగే నిరుద్యోగులను వంచించిన
- ఎప్పుడు నిర్వహిస్తామో ప్రకటించని కూటమి ప్రభుత్వం
- వేలకు వేలు ఖర్చుచేసి కోచింగ్ తీసుకుంటున్న అభ్యర్థులు
- ప్రభుత్వ వైఖరిపై ఆగ్రహం
- ఉమ్మడి జిల్లాలో ఖాళీలు 601

ఉపాధ్యాయ కొలువుల భర్తీకి సంబంధించి ఎప్పుడెప్పుడా అని కోటి ఆశలతో ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు కూటమి సర్కార్ షాక్‌ల మీద షాక్‌లు ఇస్తోంది. ఈ నెల మొదటి వారంలో నోటిఫికేషన్ వెలువడుతుందని డీఎస్సీకి అర్హులైన అభ్యర్థులందరూ భావించారు. విద్యాశాఖ సైతం కసరత్తు చేస్తున్నట్లు ప్రకటించింది. చివరకు ఎప్పటిలాగే డీఎస్సీ ప్రకటన వాయిదా పడింది. ఎప్పుడు విడుదల చేస్తామన్న దానిపై ప్రభుత్వం క్లారిటీ ఇవ్వకపోవడంపై అభ్యర్థుల్లో ఆందోళన నెలకొంది.

ఒంగోలు సిటీ: డీఎస్సీ రాయాలనుకునే వారిని ఎప్పటిలాగే చంద్రబాబు వంచించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామని ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక తన నైజాన్ని చూపారు. కుంటిసాకులు చెబుతూ నోటిఫికేషన్ వాయిదా వేస్తూ వస్తుండటంపై నిరుద్యోగులు మండిపడుతున్నారు. జిల్లాలో డీఎడ్, బీఎడ్, ఇతరత్రా ఉపాధ్యాయ కోర్సులు చేసినవారు చాలా మంది ఉన్నారు. వీళ్లంతా ఇప్పటికే టెట్ కూడా పాసయ్యారు. డీఎస్సీ నోటిఫికేషన్ ఎప్పుడా అని ఆశగా ఎదురు చూస్తున్నారు. కానీ, ఇంతవరకు ఆ ఊసేలేదు. అదిగో డీఎస్సీ.. ఇదిగో డీఎస్సీ అంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప నోటిఫికేషన్ మాత్రం ప్రకటించడం లేదు. ఎన్నికల ముందు మెగా డీఎస్సీ అంటూ ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చాక తూతూమంత్రంగా పోస్టులు చూపించి భర్తీ చేస్తామన్నారు. ఆ దిశగా అడుగులు పడలేదు. ఏదో ఒక సాకు చెబుతూ వాయిదాల మీద వాయిదాలు వేస్తూ వస్తున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు నెలల్లో డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామని మంత్రి లోకేష్ ప్రకటించారు. ఆ లెక్క ప్రకారం నవంబర్ మొదటి వారంలో ప్రకటన రావాల్సి ఉంది. టీడీపీ అనుకూల మీడియా సైతం అదిగో డీఎస్సీ అంటూ ఊదరగొట్టింది. త్వరలో నోటిఫికేషన్ వస్తోందంటూ విద్యాశాఖ అధికారులు సైతం లీకులిస్తూ వచ్చారు. అయితే, ప్రకటన వెలువడలేదు. న్యాయపరమైన వివాదాలు పరిష్కరించాకే ప్రకటన ఉంటుందని లోకేష్ చెప్పడంతో అభ్యర్థులంతా కంగుతిన్నారు. డీఎస్సీ కోసం ఆశగా ఎదురు చూస్తున్నవారికి మళ్లీ నిరాశ తప్పలేదు. గత ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరిలో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ క్రమంలో మే నెల నాటికి ప్రక్రియ పూర్తి.. జూన్లో పాఠశాలల పునఃప్రారంభం నాటికి ఉద్యోగాల్లో ఉంటామన్న ఆశతో లక్షల మంది అభ్యర్థులు ప్రైవేట్ ఉద్యో గాలను వదిలేసి శిక్షణ పొందుతున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో పరీక్షలు జరగలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరునెలల్లో వాయిదాల పర్వం మొదలైంది.

కోచింగ్‌లతో ఆర్థిక భారం...

చిన్నాచితకా ఉద్యోగాలు చేసుకుంటూ ఒక పక్క కోచింగ్, మరో పక్క కుటుంబ బాధ్యతలు చూసుకుంటూ ఎలాగోలా డీఎస్సీకి ఎంతోమంది సన్నద్ధం అవుతున్నారు. డీఎస్సీ ఇలాగే లేట్ అయితే వాళ్ల కుటుంబ పరిస్థితులు దారుణంగా మారతాయి. ఒక పక్క నెలరోజులు, రెండు నెలలు సెలవులు పెట్టి మరీ డీఎస్సీ కోచింగ్‌కు వెళ్తున్నారు. ఇప్పటికే ఏడాది కాలంగా ఆర్థికంగా నష్టపోయామని అభ్యర్థులు వాపోతున్నారు. ఆగస్టు చివరి నుంచి సెప్టెంబరు, అక్టోబర్ వరకు టెట్ నిర్వహించింది. ఇటీవలే ఫలితాలు కూడా వచ్చాయి. ఇక అందరూ ఆశగా డీఎస్సీ కోసం ఎదురుచూస్తూ వచ్చారు. తాజా ప్రకటనతో వారి ఆశలపై నీళ్లు చల్లినట్లయింది.

ఖాళీలు ఇలా...

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ యాజమాన్య పరిధిలో 3,104 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లోని ఖాళీలను గుర్తించే ప్రక్రియను అధికారులు పకడ్బందీగా చేపట్టారు. 2025 డిసెంబర్ వరకు ఏర్పడే ఖాళీలను అనుసరించి డీఎస్సీ పోస్టుల భర్తీకి కసరత్తు చేశారు. ఈ ప్రక్రియలో భాగంగా మొత్తం 591 వివిధ కేడర్లలో ఖాళీగా ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం. మొత్తం 591 పోస్టులలో భాగంగా వివిధ సబ్జెక్టుల స్కూల్ అసిస్టెంట్ కేడర్ పోస్టులు 511 ఖాళీగా ఉన్నాయి. మిగిలిన 80 పోస్టులు ఎస్జీటీ కేడర్ పోస్టులు భర్తీ చేసేందుకు చర్యలు చేపడుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో గుర్తించిన పోస్టులు...

పోస్టు	జెడ్పీ/ప్రభుత్వ/ఎంపీపీ పాఠశాలలు
ఎస్జీటీ	90
స్కూల్ అసిస్టెంట్ తెలుగు	30
స్కూల్ అసిస్టెంట్ హిందీ	23
ఇంగ్లీషు	94
గణితం	92
ఫిజిక్స్	24
జువాలజీ	70
సోషల్	106
ఫిజికల్ ఎడ్యుకేషన్	72
మొత్తం	601

పాత డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేసిన జగన్...

1998, 2008 సంవత్సరాలలో నిర్వహించిన డీఎస్సీలో అర్హత సాధించిన అభ్యర్థులకు అప్పటి ప్రభుత్వాలు అన్యాయం చేశాయి. ఎన్నిసార్లు ప్రభుత్వాలను కలిసి విజ్ఞప్తి చేసినా పట్టించుకున్న దాఖలాల్లేవు. దాదాపు రెండు దశాబ్దాలుగా ఉద్యోగాల కోసం ఎదురు చూశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వారందరికీ న్యాయం జరిగింది. ఏళ్ల తరబడి పోస్టింగ్‌ల కోసం ఎదురుచూసిన వారికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగాలిచ్చారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 1998 డీఎస్సీకి సంబంధించి 175 మందికి ఉద్యోగాలు ఇవ్వగా, వీరు 2023 ఏప్రిల్ 12న ఉద్యోగంలో చేరారు. అలాగే 2008 డీఎస్సీకి సంబంధించి 106 మందికి పోస్టింగ్ ఇచ్చారు.



ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం

డీఎస్సీ నోటిఫికేషన్‌ను వాయిదా వేయకుండా వెంటనే ప్రకటించాలి. నోటిఫికేషన్ వాయిదా పడటం వలన ఆర్థికంగా ఎంతో ఇబ్బందిపడుతున్నాం. ఒక సంవత్సరం నుంచి ప్రైవేట్ స్కూల్‌లో పనిచేయకుండా కోచింగ్ తీసుకుంటున్నా. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి.

– ఏ బసవరాజు, పీఈటీ



నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలి

వాయిదా వేయకుండా త్వరగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి. గతంలో అనుకున్న ప్రకారం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నిరుద్యోగ అభ్యర్థులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– ఎం.వెంకటేష్, బయాలజీ

సోషల్ మీడియా కార్యకర్తలకు అండగా..

● వైఎస్సార్ సీపీ ప్రత్యేక బృందాల ఏర్పాటు

ఒంగోలు సిటీ: అక్రమ నిర్బంధాలు, అరెస్టులకు గురవుతున్న వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తలకు అండగా ఉండేందుకు పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ తరఫున ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లా నుంచి సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు, కేవీ రమణారెడ్డిని నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ బృందం సోషల్ మీడియా కార్యకర్తలకు న్యాయ సహాయం అందించడంతో పాటు వారికి, వారి కుటుంబాలకు భరోసా ఇవ్వనుంది. జిల్లాలోని పార్టీ నేతలు, లీగల్ సెల్ ప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ ఈ బృందం పనిచేయనుంది.

బాలల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

● అధికారులతో కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: బాలల హక్కుల పరిరక్షణకు సంబంధించిన చట్టాలపై అధికారులందరికీ సమగ్రమైన అవగాహన ఉండాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. బంగారు బాల్యం కార్యక్రమం నేపథ్యంలో బాలల హక్కుల చట్టాలపై జిల్లా స్థాయి అధికారులకు గురువారం ప్రకాశం భవనంలోని గ్రీవెన్స్ హాలులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చట్టాలతో పాటు ప్రభుత్వ పథకాలు పొందేందుకు కావాల్సిన అర్హతలపై ప్రజలకు విస్తృతమైన అవగాహన కల్పించాలన్నారు. దీనిపై అధికార యంత్రాగానికి ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. న్యాయ, కార్మిక, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్ష చట్టం, పోక్సో, విద్యా హక్కు చట్టాలపై ఆయా శాఖల ఉన్నతాధికారులు, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రవిశంకర్, రాఘవులు వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ ఓబులేసు, ఐసీడీఎస్ పీడీ మాధురి, ఉప విద్యా శాఖాధికారి సుబ్బారావు, కనిగిరి, ఒంగోలు ఆర్డీఓలు కేశవర్ధన్‌రెడ్డి, లక్ష్మీప్రసన్న, వీవీ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

దళితులకు మంత్రి డోలా క్షమాపణ చెప్పాలి

- టంగుటూరు మండలంలో బాలికపై లైంగికదాడి జరగలేదంటూ మంత్రి బుకాయించారు
- అగ్రవర్ణ ఉపాధ్యాయుడికి కొమ్ముకాశారు
- నైతికత ఉంటే మంత్రి పదవికి రాజీనామా చేయాలి
- దళిత బిడ్డకు వైఎస్సార్ సీపీ అండగా నిలవడంతోనే నిందితుడి అరెస్ట్
- విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్

జరుగుమల్లి (సింగరాయకొండ): టంగుటూరు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న దళిత బాలికపై లైంగికదాడి జరిగితే.. అసలు జరగనేలేదని మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి మాట్లాడటం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ విమర్శించారు. జరగని ఘటనను జరిగినట్లుగా వైఎస్సార్ సీపీ నాయకులు మాట్లాడి రాజకీయం చేసి లబ్ధిపొందాలని చూస్తున్నారంటూ మంత్రి అనడం హాస్యాస్పదమన్నారు. మంత్రిగా ఉన్నటువంటి వ్యక్తే ఈ విధంగా ఉంటే దళితులకు రక్షణ ఎలా ఉంటుందంటూ ఆదిమూలపు సురేష్ ఆందోళన వ్యక్తం చేశారు. జరుగుమల్లి ఎస్సీకాలనీలో గురువారం ఓ వివాహానికి హాజరైన ఆయన.. విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి టంగుటూరు మండలంలో బాలికపై లైంగికదాడి ఘటన గురించి మాట్లాడారు. టీడీపీ సామాజిక వర్గానికి చెందిన ఉపాధ్యాయుడు బాలికపై లైంగికదాడికి పాల్పడింది వాస్తవం కాదా అని మంత్రిని నిలదీశారు. ఆ ఉపాధ్యాయుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచింది నిజం కాదా అని ప్రశ్నించారు. మొదటి నుంచి పోలీసులను ప్రభావితం చేసి ఆ ఉపాధ్యాయుడికి మంత్రి డోలా కొమ్ముకాసే ప్రయత్నం చేశారని, చివరికి వైఎస్సార్ సీపీ ఆందోళనతో పోలీసులు న్యాయం వైపు నిలబడ్డారని తెలిపారు. కానీ, బాలికపై లైంగికదాడి జరగకుండానే జరిగినట్లుగా వైఎస్సార్ సీపీ నాయకులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని, ఈ ఘటనను రాజకీయంగా వాడుకుంటున్నారని మంత్రి స్వామి విమర్శించడాన్ని ఆదిమూలపు సురేష్ దుయ్యబట్టారు. దళిత బిడ్డకు అన్యాయం జరిగితే వైఎస్సార్ సీపీ నాయకులంతా బాధిత కుటుంబానికి అండగా నిలవడం, ధైర్యం చెప్పడం తప్పా అని ప్రశ్నించారు. సాంఘిక సంక్షేమ శాఖామంత్రిగా ఉన్న డోలా.. కనీస బాధ్యతగా బాలికను, బాలిక కుటుంబ సభ్యులను పరామర్శించలేదని, విచారించలేదని, వారికి రక్షణ కల్పించి అండగా నిలవలేదని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఆ కుటుంబానికి అండగా నిలిచి ఎఫ్ఐఆర్ నమోదుకు నాలుగు రోజులు పోరాటం చేశారని, నిందితుడిని అరెస్ట్ చేసేంత వరకూ పోరాడారని తెలిపారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఆ తల్లి రోదిస్తుంటే.. ఎస్పీ స్థాయి అధికారితో విచారణ జరిపించాలని పోరాటం చేశామన్నారు. అందువలనే పోక్సో కేసు నమోదు చేసి నిందితుడిని పట్టుకున్నారని సురేష్ వివరించారు. ఈ ఘటనలో దళిత బిడ్డకు అన్యాయం చేసి అగ్రవర్ణ ఉపాధ్యాయుడికి కొమ్ముకాసిన మంత్రి డోలా దళిత జాతికి భేషరతుగా క్షమాపణ చెప్పాలని, నైతికత ఉంటే తన పదవికి రాజీనామా చేయాలని ఆదిమూలపు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గత ఐదునెలల కాలంలో బాలికలు, మహిళలపై దాడులు, లైంగిక దాడులు జరుతున్నాయని, సుమారు 92 పైచిలుకు కేసులు నడుస్తున్నాయని, మంత్రి డోలా వంటి నాయకుల అండదండలతోనే ఇవన్నీ జరుగుతున్నాయని ఆరోపించారు.

కొండపి నియోజకవర్గంలో అడ్డగోలుగా ఇసుక దోపిడీ...

మంత్రి డోలా ప్రాతినిధ్యం వహిస్తున్న కొండపి నియోజకవర్గంలో ఇసుక దోపిడీ విచ్చలవిడిగా జరుగుతుంటే.. తనకు సంబంధం లేదని, తనను అడగవద్దని ఆయన మాట్లాడటం సిగ్గుచేటని ఆదిమూలపు సురేష్ అన్నారు. నియోజకవర్గానికి ఆయనే ఇన్‌చార్జా.. లేక ఇంకెవరన్నానా అని ప్రశ్నించారు.

మా నాయకులు, కార్యకర్తలను కాపాడుకుంటాం...

నర్సింగోలు గ్రామానికి చెందిన ముప్వల గంగాధర్ అనే వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా యాక్టివిస్టును బుధవారం పోలీసులు తీసుకెళ్లి జరుగుమల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించలేదని ఆదిమూలపు సురేష్ అన్నారు. ఒకసారి కందుకూరు పోలీస్‌స్టేషన్ అని, మరోసారి కందుకూరు రూరల్ పోలీస్‌స్టేషన్ అంటూ తిప్పుతున్నారని, ఎక్కడ ఉన్నాడో తెలియడం లేదని, చివరికి రాత్రి వదిలిపెట్టి మళ్లీ ఉదయాన్నే రావాలని చెబుతున్నారని, ఇంతకీ అతను చేసిన తప్పు ఏంటో చెప్పాలని ఫోన్ చేస్తే ఒక్క అధికారి కూడా ఫోన్ ఎత్తడం లేదని తెలిపారు. అధికార యంత్రాంగాన్ని, పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేస్తూ వైఎస్సార్ సీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని, దాడులు చేస్తున్నారని, ఇలాంటి చర్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. తమ నాయకులు, కార్యకర్తలను కాపాడుకుంటామని స్పష్టం చేశారు. ఏ కార్యకర్తను ఇబ్బంది పెట్టినా సహించేది లేదన్నారు. వాస్తవానికి తమ పార్టీ శ్రేణులు చేసిన తప్పేమీ లేదని, ప్రభుత్వం చేసే తప్పిదాలను ఎత్తి చూపామని, ప్రజాస్వామ్య వ్యవస్థలో వాక్ స్వాతంత్ర్యం లేదా అని ప్రశ్నించారు. విలేకరుల సమావేశంలో పీడీసీసీబీ మాజీ చైర్మన్ మాదాసి వెంకయ్య, నాయకులు బత్తిన మదనమనోహరరావు, పిన్నిక శ్రీనివాసరావు, మసనం వెంకట్రావు, దుంపా అనిల్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ పున్నారావు, కొరకూటి వెంకటేశ్వర్లు, మాదాల శంకర్, ఎండ్లూరి రవి పాల్గొన్నారు.



చిన్నారులతో కలెక్టర్ తమీమ్ అన్సారియా, అధికారులు

బాలలంతా స్వేచ్ఛగా ఎదగాలి

- కలలను సాకారం చేసుకునే అవకాశం వారికి కల్పించాలి
- బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలి
- చిన్నతనంలోనే లక్ష్యాలు నిర్దేశించుకునేలా చూడాలి
- బంగారు బాలోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: ప్రతి బిడ్డ మంచి వాతావరణంలో పెరిగి వారి కలలను సాకారం చేసుకునే స్వేచ్ఛను తల్లిదండ్రులు, సమాజం కల్పించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని బంగారు బాల్యం కార్యక్రమంలో భాగంగా వారం రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న బంగారు బాలోత్సవాలను గురువారం ప్రకాశం భవనంలోని గ్రీవెన్స్ హాలులో కలెక్టర్ ప్రారంభించారు. ముందుగా బాలలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాలల స్వేచ్ఛకు ప్రతీకగా చిన్నారులచే బెలూన్లను గాలిలోకి ఎగురవేయించారు. కార్యక్రమానికి హాజరైన అధికారులు, ప్రజలతో బాలల హక్కులను పరిరక్షిస్తామని, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా తమవంతు బాధ్యతగా పనిచేస్తామని కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల కార్మికులు లేని, బాల్య వివాహ రహిత, అక్షర చైతన్య, ఆరోగ్య ప్రదమైన ప్రకాశం జిల్లా ఆవిష్కరణే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా 18 ఏళ్లలోపు బాలలపై ప్రత్యేక శ్రద్ధ వహించి బంగారు బాల్యం కార్యక్రమాన్ని రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. సంతోషం, ఆరోగ్యం, సురక్షితమైన బాల్యాన్ని బాలలకు అందించేందుకు వివిధ శాఖల అధికారులతో గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీలను నియమించామన్నారు. బంగారు బాల్యం కార్యక్రమంపై అవగాహన కల్పించే పోస్టర్లను ఆవిష్కరించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.శ్యామ్‌బాబు, నగర మేయర్ సుజాత, బాలల సంక్షేమ కమిటీ చైర్మన్ వి.రామాంజనేయులు, డీఆర్‌ఓ ఓబులేసు, ఐసీడీఎస్ పీడీ మాధురి, బంగారు బాల్యం నోడల్ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, డీఈఓ కిరణ్‌కుమార్, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీఎంహెచ్‌ఓ సురేష్, డీఆర్‌డీఏ పీడీ వసుంధర, మెప్మా పీడీ రవికుమార్, బీసీ సంక్షేమ అధికారి అంజల, మైనార్టీ సంక్షేమ అధికారి నారాయణ, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ అర్చన, డీసీపీఓ దినేష్‌కుమార్, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సునీల్, బాబూరావు, కోటేశ్వరరావు, అధిక సంఖ్యలో చిన్నారులు పాల్గొన్నారు.

మా కడుపు కొడుతున్నారు



ధర్నా చేస్తున్న పారిశుధ్య విభాగం మేస్త్రీలు

ఒంగోలు సబర్బన్: కూటమి పార్టీల నేతలు, ఒంగోలు నగర పాలక సంస్థ అధికారులు పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న మేస్త్రీల కడుపు కొడుతున్నారని ఏపీ మున్సిపల్ వర్కర్ల యూనియన్ నాయకులు ధ్వజమెత్తారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం ముందు గురువారం ధర్నా చేశారు. అధికారులు, కూటమి నాయకులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. యూనియన్ నాయకుడు కె.ఆదినారాయణ మాట్లాడుతూ కూటమి పార్టీల నాయకులు, ఒంగోలు నగర కమిషనర్ వెంకటేశ్వరరావు కలిసి మేస్త్రీలను ఉద్యోగం నుంచి తొలగించటం అత్యంత దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. మేస్త్రీల స్థానంలో కూటమికి చెందిన కార్యకర్తలను నియమించుకునేందుకు కుట్ర పన్నుతున్నారని మండిపడ్డారు. నగరపాలక సంస్థలో గత 15 సంవత్సరాల నుంచి పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న మేస్త్రీ విధుల్లో కొనసాగించాలని డిమాండ్ చేశారు. వేతనాలతో కూడిన మస్టర్ ఇవ్వాలని ఒంగోలు నగరంలో ఐదు డివిజన్లలో నిరసన కార్యక్రమం చేపట్టామన్నారు. పనిచేస్తున్న కార్మికులను విధుల్లో తీసుకోవాలని డిమాండ్ చేశారు. నగర అధ్యక్ష, కార్యదర్శులు జి.నరసింహ, టి.విజయమ్మ, యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన బత్తుల


వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో బత్తుల బ్రహ్మానందరెడ్డి

ఒంగోలు సిటీ: మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మానందరెడ్డి గురువారం తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన తాజా రాజకీయ పరిస్థితులను వివరించారు. సోషల్ మీడియా యాక్టివిస్టులపై ప్రభుత్వ కేసుల విషయాలను జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.

దాడి కేసులో నిందితులకు నాలుగేళ్ల జైలు

ఒంగోలు: దాడి కేసులో నిందితులకు నాలుగేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.16 వేల జరిమానా విధిస్తూ 7వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి టి.రాజా వెంకటాద్రి గురువారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించే మంచా హుస్సేన్‌ను దొనకొండ మండలం సిద్ధాయపాలెం గ్రామానికి చెందిన చొప్పవరపు సాగర్, మందగిరి సుబ్బయ్య, మందగిరి సాగర్ బుచ్చయ్య అలియాస్ బుచ్చయ్య బయటకు వెళదాం రమ్మని పిలిచారు. అందుకు హుస్సేన్ తాను రాలేనని చెప్పడంతో ఆగ్రహించిన ముగ్గురు నిందితులు కులం పేరుతో దూషించి భౌతిక దాడికి పాల్పడినట్లు దొనకొండ పోలీసుస్టేషన్‌లో 2018 అక్టోబరు 6న కేసు నమోదైంది. దీనిపై విచారణ జరిపి అప్పటి దర్శి డీఎస్పీ కె.నాగేశ్వరరావు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. దీనిపై స్థానిక 7వ అదనపు జిల్లా జడ్జి కోర్టులో వాదనలు ముగియడంతో గురువారం న్యాయమూర్తి తీర్పునిచ్చారు. నిందితులపై పలు సెక్షన్ల కింద నేరం నిరూపణ అయినట్లు పేర్కొంటూ ఒక్కో నిందితునికి నాలుగేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.16 వేలు జరిమానా విధించారు. జరిమానా మొత్తం రూ.48 వేలలో బాధితునికి రూ.40 వేలు పరిహారంగా ప్రకటిస్తూ న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు.

ట్రావెల్స్ బస్సు, పాల ట్యాంకర్ ఢీ

- అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ట్రావెల్స్ బస్


చెట్టును ఢీకొట్టి నుజ్జు నుజ్జు అయిన ట్రావెల్స్ బస్

బేస్తవారిపేట: మండలంలోని ఒందుట్ల సమీపంలో ఒంగోలు–నంద్యాల హైవేరోడ్డుపై ప్రైవేట్ బస్సు, పాల ట్యాంకర్ ఢీకొన్నాయి. ఈ ఘటన గురువారం తెల్లవారుజామున జరిగింది. వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్ నుంచి గిద్దలూరు వైపునకు హరికృష్ణ ట్రావెల్స్ బస్ వెళ్తుంది. బస్సు ముందు వైపు గిద్దలూరు వైపునకు ఖాళీ పాల ట్యాంకర్ లారీ పోతుంది. ఈ క్రమంలో బస్సు ఓవర్ టేక్ చేసే సమయంలో పాల ట్యాంకర్ లారీని డ్రైవర్ సడన్‌గా కుడివైపుకు తిప్పాడు. ప్రమాదంలో పాల ట్యాంకర్‌ను ట్రావెల్స్‌బస్ ఒకవైపు ఢీకొట్టింది. అదుపుతప్పిన ట్రావెల్స్‌బస్ రోడ్డు పక్కన ఉన్న చెట్టును వేగంగా వెళ్లి ఢీకొట్టింది. పాలట్యాంకర్ లారీ రోడ్డు మార్జిన్ దిగి పొలాల్లోకి దూసుకెళ్లింది. ట్రావెల్స్ బస్‌లో ప్రయాణికులు ఎవ్వరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఘటనలో ట్రావెల్స్ బస్ ముందు భాగం నుజ్జు నుజ్జు అయింది. ట్యాంకర్ లారీ కొంత మేర దెబ్బతింది.



- జిల్లాలోని గ్రంథాలయాల్లో వేధిస్తున్న సిబ్బంది కొరత
- 104 మందికిగాను అందుబాటులో 34 మందే..
- ఖాళీగా ఉన్న 70 పోస్టులను భర్తీ చేయాలని పాఠకుల వినతి
- ఒక్కో ఉద్యోగికి రెండు, మూడు చోట్ల ఇన్‌చార్జి బాధ్యతలు
- ఒకచోట విధుల్లో ఉంటే మిగిలిన లైబ్రరీలు మూతపడుతున్న వైనం
- నిధులివ్వకుండా వారోత్సవాలు నిర్వహించాలని ఆదేశించడంపై లైబ్రేరియన్ల మల్లగుల్లాలు



గ్రంథపాలకుడు మరో చోట విధుల్లో ఉన్న రోజు మూతపడిన కంభం గ్రంథాలయం

సమస్యల గ్రంథం!

కంభం/బేస్తవారిపేట:

జిల్లాలోని విజ్ఞాన భాండాగారాల తలుపులు సిబ్బంది కొరత కారణంగా తరచూ మూతపడుతున్నాయి. పుస్తకాలు చదువుకునేందుకు ఆసక్తిగా గ్రంథాలయాల వైపు అడుగులు వేసిన వారు అక్కడి దృశ్యాలను చూసి నిరాశగా వెనుదిరుగుతున్న దుస్థితి. లైబ్రరీలను అరకొరగా తెరుస్తుండటంతో పుస్తక పఠనాన్నే వ్యాపకంగా మార్చుకున్న విశ్రాంత ఉద్యోగులు, వృద్ధులు, పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగులు, అలాగే చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. రూ.100 చెల్లించి సభ్యత్వం తీసుకున్న వారంతా నెలలో సగం రోజులు కూడా గ్రంథాలయంలో అడుగుపెట్టలేకపోతున్నారు. గతంలో అందుబాటులో ఉన్న గ్రామీణ గ్రంథాలయాలు కూడా ప్రస్తుతం పనిచేయడం లేదు. అతి కొద్ది ప్రాంతాల్లో మాత్రమే అందుబాటులో ఉన్న బుక్ డిపాజిట్ సెంటర్లలో దినపత్రికలు మాత్రమే ఉంటున్నాయి. వీరు అవసరమైనవారికి ఇతర గ్రంథాలయాల నుంచి పుస్తకాలు తెచ్చి పాఠకులకు అందిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలతోపాటు పట్టణ ప్రజలు ఎక్కువగా గ్రంథాలయాలపైనే ఆధారపడుతున్న నేపథ్యంలో సక్రమంగా తెరవని కారణంగా సమాచారం కోసం ఇబ్బంది పడుతున్నారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత

జిల్లాలో 66 గ్రంథాలయాలు ఉండగా 30 చోట్ల లైబ్రేరియన్ల కొరత వేధిస్తోంది. అన్ని లైబ్రరీల్లో కలిపి 104 మంది సిబ్బందికిగాను 34 మంది మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. ఒక్కో గ్రంథపాలకుడు రెండు లేదా మూడు లైబ్రరీలను చూసుకోవాల్సిన పరిస్థితి. కొన్ని చోట్ల గ్రంథపాలకులు లేక జూనియర్ అసిస్టెంట్లు, రికార్డ్ అసిస్టెంట్లు, అటెండర్లతో నెట్టుకొస్తున్నారు. జిల్లాలో సుమారు 50 గ్రంథాలయాలు వారానికి 3 నుంచి 4 రోజులు మాత్రమే తెరుస్తున్నారు. లైబ్రేరియన్ ఒకచోట విధులు నిర్వర్తిస్తుంటే.. ఇన్‌చార్జిగా ఉన్న గ్రంథాలయాలకు తాళం పడుతోంది. దీంతో అక్కడి పాఠకులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. సిబ్బంది కొరత కారణంగా సగానికి పైగా లైబ్రరీల్లో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను సక్రమంగా నిర్వహించలేని పరిస్థితి. ఉన్నతాధికారులు స్పందించి, ఖాళీలను వెంటనే భర్తీ చేసి నిరుద్యోగులకు, విద్యార్థులకు గ్రంథాలయాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జిల్లాలోని గ్రంథాలయాల్లో ఉద్యోగుల ఖాళీలు ఇలా..

క్యాడర్	ఉండాల్సిన సిబ్బంది	ప్రస్తుతం ఉన్నది	ఖాళీలు
గ్రేడ్-1 గ్రంథపాలకుడు	02	02	-
గ్రేడ్-2 గ్రంథపాలకుడు	04	-	04
గ్రేడ్-3 గ్రంథపాలకుడు	47	23	24
రికార్డ్ అసిస్టెంట్	26	06	20
అటెండర్లు	14	-	14
వాచ్‌మెన్లు	08	-	08
టైపిస్టు	01	01	-
జూనియర్ అసిస్టెంట్	02	02	-
మొత్తం	104	34	70

వారానికి 4 రోజులు అందుబాటులో ఉంటా

రాచర్ల మండలం ఆకవీడులో రికార్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నా. అక్కడ మంగళవారం, ఆదివారం గ్రంథాలయంలో ఉంటా. సోమ, బుధ, గురు, శనివారాల్లో కంభంలో ఉన్న గ్రంథాలయానికి వస్తా. ఒక చోట విధుల్లో ఉన్న సమయంలో మరో చోట పాఠకులు ఇబ్బంది పడుతున్న విషయం వాస్తవమే.

– ఎస్.వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జి లైబ్రేరియన్, కంభం

పైసా విదల్చకుండా ఉత్సవాలెలా?

గ్రంథాలయాలను కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. గ్రంథాలయ వారోత్సవాల నిర్వహణకు నిధులు విడుదల చేయకుండా మొండిచేయి చూపింది. ఉత్సవాల ఏర్పాట్లపై ఆదేశాలు జారీ చేసిన సర్కారు.. నిర్వహణకు దాతలు, స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలని సూచించడం గమనార్హం. రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ సంచాలకుల నుంచి వారోత్సవాల నిర్వహణకు బడ్జెట్ మంజూరైన తర్వాత నిధులు కేటాయిస్తామని ఉత్తర్వుల్లో పేర్కొనడం చర్చనీయాంశమైంది. దాతల సహకారంతో కార్యక్రమాలు నిర్వహించాక గ్రంథాలయాలకు నిధులివ్వడం ఏమిటనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జిల్లా కేంద్ర గ్రంథాలయానికి రూ.35 వేలు, ప్రధాన మున్సిపాలిటీల్లో ప్రథమ శ్రేణి గ్రంథాలయాలకు రూ.15 వేలు, ద్వితీయ శ్రేణికి రూ.11 వేలు, మండల కేంద్రాల్లోని తృతీయ శ్రేణి లైబ్రరీలకు రూ.8 వేల చొప్పున ఏటా నిధులిచ్చారు. కానీ ఈ ఏడాది నిధుల కేటాయింపులు లేకపోవడం, ఈ నెల వేతనం ఇప్పటికీ అందకపోవడంతో ఖర్చులపై లైబ్రేరియన్లు తర్జనభర్జన పడుతున్నారు. వ్యాసరచన, సెమినార్, క్విజ్, చిత్రలేఖనం, పాటలు, ముగ్గుల పోటీలు, చదరంగం, ఇతర ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు ఎలా ఇవ్వాలో తెలియక దాతల కోసం వెతుకులాట ప్రారంభించారు.


బేస్తవారిపేట గ్రంథాలయంలో బహుమతులతో చిన్నారులు(ఫైల్)

రోజూ అందుబాటులో ఉండాలి



గ్రంథాలయాలు రోజూ అందుబాటులో ఉంటే నిరుద్యోగులకు ఎంతో ఉపయోకరంగా ఉంటుంది. సిబ్బంది లేరని చెప్పి రోజూ తెరవడం లేదు. ఒక్కో సారి మూతపడిన గ్రంథాలయాన్ని చూసి వెనుదిరగాల్సి వస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి రోజూ లైబ్రరీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి.

– షేక్ శిలార్, కంభం

రెగ్యులర్ గ్రంథపాలకుడిని నియమించాలి



రెగ్యులర్ గ్రంథపాలకుడు లేకపోవడంతో సమాచారం కోసం లైబ్రరీకి వెళ్లే నిరుద్యోగులు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. రోజూ లైబ్రరీలు తెరుస్తుంటే అక్కడికి వచ్చే పాఠకుల సంఖ్య పెరుగుతుంది. రెగ్యులర్ గ్రంథపాలకుడిని నియమించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– జి.సుదర్శన్ కుమార్, నిరుద్యోగి, కంభం

మాజీ సైనికుల పిల్లలకు పీఎం స్కాలర్‌షిప్‌లు


ఒంగోలు టౌన్: మాజీ సైనికుల పిల్లలకు ప్రధాన మంత్రి స్కాలర్ షిప్ పథకం -2024-25కు న్యూఢిల్లీలోని సైనిక బోర్డు దరఖాస్తులను ఆహ్వానిస్తుందని జిల్లా సైనిక అధికారి రజనీకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన నిబంధనల ప్రకారం సాంకేతిక, వృత్తి విద్యా కోర్సులకు మాత్రమే కాకుండా ఇంటిగ్రేటెడ్ బీఏ, బీకాం, బీఎస్సీలతో పాటుగా ఎల్ఎల్‌బీ, ఇంటిగ్రేటెడ్ బీఏ, బీకాం, బీఎస్సీలతో పాటుగా బీఈడీ కోర్సులభ్యసించే విద్యార్థులకు అవకాశం ఉంటుందన్నారు. రెండో సంవత్సరం, మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేయవచ్చని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు కేంద్రీయ సైనిక బోర్డు, న్యూఢిల్లీ వెబ్‌సైట్‌లో దరఖాస్తులను ఈ నెల 30వ తేదలోగా పంపించాలని కోరారు.

రైతుల ఆత్మహత్యలను పట్టించుకోని ప్రభుత్వం

- సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు వడ్డే శోభనాద్రీశ్వరరావు


పోస్టర్‌ను విడుదల చేస్తున్న రైతు నాయకులు


ఒంగోలు టౌన్: దేశ వ్యాప్తంగా రోజురోజుకీ రైతుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నా మోదీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు వడ్డే శోభనాద్రీశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక మల్లయ్యలింగం భవనంలో సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోడీ మూడోసారి అధికారం చేపట్టిన తరువాత వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టే దిశగా ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. బడ్జెట్లో ఎరువులు, పురుగుల మందులు, ఆహార సబ్సిడీ, ఉపాధి హామీకి నిధుల కేటాయింపులో భారీ కోత విధించారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతాంగ వ్యతిరేక విధానాలపై ఎంతకాలం పోరాటాలు చేయాలో చెప్పాలని ప్రశ్నించారు. రైతాంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 26వ తేదిన రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని దేశ వ్యాప్తంగా 500 జిల్లాల్లో రైతులు, కార్మికులు, పట్టణ పేదలు, మహిళలు, ప్రజా సంఘాలతో కలెక్టర్ కార్యాలయాల వద్ద కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు హెచ్చరిక నోటీసు మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రైతుల ఆత్మహత్యలను నివారించేందుకు కేరళ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు రుణ ఉపశమన చట్టాన్ని పార్లమెంటులో ఆమోదించి దేశంలోని అన్నీ రాష్ట్రాలలో అమలు చసేలా చర్యలు తీసుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. స్మార్ట్ మోటార్లను బిగించే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని నల్లమల రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొల్లా రాజమోహన్ కోరారు. ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్, విప్లవ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు భీమవరపు సుబ్బారావు, రైతు కూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పరిటాల కోటేశ్వరరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసరావు, వడ్డే హనుమారెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బి. శ్రీనివాసరావు, ఎస్టీ సర్దార్, ఉబ్బ ఆదిలక్ష్మి, శ్రీరాం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


శాస్త్రీయ నృత్యం చేస్తున్న విద్యార్థులు


విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోండి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా


కలెక్టరేట్‌లో జరిగిన బంగారు బాలోత్సవంలో ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, ప్రజాప్రతినిధులు

ఒంగోలు సిటీ: విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకొని వాటిని సాకారం చేసుకునేందుకు కష్టపడాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం బండ్లమిట్టలోని బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. బాలికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో చక్కగా చదువుకోవాలన్నారు. విద్యార్థి దశలోనే నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలన్నారు. సమాజంలో జరుగుతున్న అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ప్రతి రోజూ న్యూస్ పేపర్లు, పుస్తకాలు చదివి విషయ పరిజ్ఞానం పెంచుకోవాలన్నారు. కాలాన్ని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకుంటే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. అనంతరం బాలసదనాన్ని సందర్శించారు. అక్కడ ఉంటున్న పిల్లలతో మమేకమై వారి యోగక్షేమాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. డీఈఓ కిరణ్‌కుమార్, ఐసీడీఎస్ పీడీ కె.మాధురి, ప్రధానోపాధ్యాయురాలు కృష్ణకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


బంగారు బాలోత్సవంలో వేషధారణలో చిన్నారులు

రూ.17 వేల కోట్ల విద్యుత్ భారం..

రాష్ట్ర చరిత్రలోనే లేదు

- ట్రూఅప్ పేరుతో ప్రజలను బాదేయడం సరికాదు
- స్మార్ట్ మీటర్లపై చంద్రబాబుది ద్వంద్వ వైఖరి
- ఇసుక, మద్యం మాఫియాకు బ్రోకర్‌లా రాష్ట్ర ప్రభుత్వం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ధ్వజం


108 ఉద్యోగుల నుంచి వినతి పత్రం స్వీకరిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ఒంగోలు టౌన్: విద్యుత్ చార్జీల పేరుతో ప్రజలపై రూ.17 వేల కోట్ల భారం వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం కావడం సిగ్గుచేటని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలను పెంచబోమంటూ హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే ట్రూ అప్ పేరుతో రూ.వేల కోట్లు గుంజాలని చూడటం తగదన్నారు. సీపీఎం ఒంగోలు నగర మహాసభల సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ప్రజా పోరు పేరుతో గురువారం ప్రదర్శన నిర్వహించారు. నగర కార్పొరేషన్ కార్యలయం నుంచి సుందరయ్య భవనం వరకు ప్రదర్శన సాగింది. అనంతరం సభలో శ్రీనివాసరావు మాట్లాడుతూ.. స్మార్ట్ మీటర్లు పగలగొట్టాలని గతంలో పిలుపునిచ్చిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చాక స్మార్ట్ మీటర్లను బిగించడం ద్వంద్వ నీతికి నిదర్శనమన్నారు. కార్పొరేట్లకు దోచిపెట్టేందుకే ప్రజలపై గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.17 వేల కోట్ల భారం మోపుతున్నారని దుయ్యబట్టారు. మంచి ప్రభుత్వం అంటే ప్రజలపై పెను భారం మోపడమేనా అని ప్రశ్నించారు. ఇళ్లకు స్టిక్కర్లు అతికిస్తే మంచి ప్రభుత్వమైపోదని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఇసుక మాఫియా రెచ్చిపోతోందని, నూతన మద్యం పాలసీ అంటూ ప్రభుత్వమే బ్రోకర్ పాత్ర పోషిస్తోందని మండిపడ్డారు. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించామంటూ జనం అడుగుతుంటే మద్యం తక్కువ ధరకు ఇస్తామని ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్నారని తూర్పారబట్టారు. రాష్ట్రంలో 2.50 లక్షల ఉద్యోగాలు, 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఉద్యోగాలు వస్తాయని భావించిన నిరుద్యోగులు నిరాశకు గురవుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ విమర్శించారు. నగరంలో తాగునీటి అవసరాల కోసం రూ.400 కోట్లు, మౌలిక వసతుల కల్పనకు రూ.500 కోట్లు కేటాయించాలని కోరారు. సభలో జి.ఆదిలక్ష్మి, జీవీ కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, దామా శ్రీనివాసరావు, ఎస్‌డీ హుసేన్, ఎండీ యాసిన్, కొర్నెపాటి శ్రీనివాసరావు, హరికృష్ణ, శ్యాం, దారా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బావిలో పడి ఆర్టీసీ కండక్టర్ మృతి


మృతదేహాన్ని బయటకు లాగుతున్న గ్రామస్తులు

పామూరు: ప్రమాదవశాత్తు పొలంలోని బావిలో పడి ఆర్టీసీ కండక్టర్ మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని కంభాలదిన్నె గ్రామ సమీపంలోని పొలాల్లోని బావి వద్ద జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గుదే వెంకటస్వామి(60) కందుకూరు ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. కాగా గురువారం గుదే వెంకటస్వామి తన అన్న వెంకట నారాయణతో కలిసి అదే గ్రామ సమీపంలోని వారికున్న పొలంలో మొక్కజొన్న మొక్కలు నాటారు. అనంతరం వెంకట స్వామిని..వెంకట నారాయణ నువ్వు ఇంటికెళ్లు..నేను తరువాత వస్తానని చెప్పి పంపించాడు. కొంత సేపటి తరువాత వెంకటనారాయణ అటువైపు రాగా బావి గట్టు పైన చెప్పులు ఉండటాన్ని గమనించి చుట్టుపక్కల చూశాడు. ఎవ్వరూ లేకపోవడంతో అనుమానంతో ఇంటికి ఫోన్‌చేసి వెంకటస్వామి వచ్చాడా లేదా అని వాకబు చేశాడు. కుటుంబసభ్యులు రాలేదని చెప్పడంతో అనుమానం వచ్చి గ్రామస్తులను, ఈతగాళ్లను తీసుకువచ్చి బావిలోకి దించి గాలించగా వెంకటస్వామి మృతదేహం లభ్యమైంది. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిషోర్‌బాబు తెలిపారు.

చెక్ బౌన్స్ కేసులో నిందితునికి రెండేళ్ల జైలు

ఒంగోలు: బ్యాంకు చెక్కు బౌన్స్ అయిన కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.6 లక్షలు జరిమానా విధిస్తూ స్థానిక ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి ఎస్.కోమలవల్లి గురువారం తీర్పునిచ్చారు. ఒంగోలుకు చెందిన కటకంశెట్టి వెంకటేశ్వర్లు వద్ద కరవదికి చెందిన కె.నాగ శివకుమార్ కుటుంబ అవసరాల నిమిత్తం రూ.8 లక్షలు అప్పు తీసుకున్నాడు. ఫిర్యాదికి బాకీ నిమిత్తం నిందితుడు రూ.3 లక్షలకు బ్యాంకు చెక్కు ఇచ్చాడు. నిందితుడి ఖాతాలో అవసరమైన మేర నిల్వ లేదంటూ బ్యాంకు చెక్కును తిరస్కరించింది. దీంతో నిందితుడికి విషయాన్ని తెలియజేస్తూ నోటీసు ఇచ్చినా ఎటువంటి స్పందన కనిపించకపోవడంతో కోర్టును ఆశ్రయించాడు. నిందితుడు నాగశివకుమార్‌పై నేరం నిరూపణ అయినట్లు పేర్కొంటూ న్యాయమూర్తి రెండేళ్ల జైలు శిక్ష విధించారు. ఫిర్యాది వెంకటేశ్వర్లుకు రూ.6 లక్షలు పరిహారం చెల్లించాలని నిందితుడిని ఆదేశించారు.